


* * *

అప్పటికి ఓ జాము నుంచి గురుకులం ముఖద్వారం వద్దకు, లోపలికి తిరుగుతున్నాడు జాయపుడు. ఇంద్రాణి కనుచూపు మేరలో లేదు.

కొత్త విద్యార్థులకు జాయపుడొక అపురూప అనుసరణీయుడు. జాయపుణ్ని ఇప్పుడు గురుకులంలో ఆట పట్టించేవారు ఎవ్వరూ లేరు. గతంలో ఉండే బిడియం తగ్గి, అతనిలో ఆత్మవిశ్వాసం మెండుగా నిండుగా తొణికిసలాడుతున్నది. అతని అసాధారణ ప్రతిభ, అందచందాలు, అతిసాధారణ ప్రవర్తన అక్కడున్న కులీన యువతీ యువకులకు విభ్రమం. అక్కడికి జాయపుడు వచ్చాడంటే సత్కళా కాలక్షేపమే. ఎన్నో గమ్మత్తయిన నాట్యాంశాలు చెప్తాడు.. చేసి చూపుతాడు. పేరుపేరునా పలకరించి నవ్వించి వెళ్తాడు. ఈరోజు జాయపునితో కబుర్లను పెద్దలు – పిన్నలు ఆశిస్తున్నారు. కానీ, ఆయన మాత్రం కాలుకాలిన మార్జాలంలా లోపలికీ బయటికీ తిరుగుతున్నాడు. బయటికి వచ్చి దూరంగా చూస్తున్నాడు కానీ.. ఇంద్రాణి పల్లకి జాడ లేదు. జాయపుని అసహనం చూస్తున్న అశోకుడు అడిగాడు..

''ఏమిటి జాయపా! ఎవరికోసం ఎదురుచూపులు.. కాకతి కోసమేనా?''.

అప్పుడొచ్చిపడ్డాడు ఇహలోకంలోకి జాయపుడు.

అరెరే.. కాకతి?! కాకతి రానురానూ తన మనో ఫలకం నుంచి చెరిగిపోతోందేమి?.. కాసేపు నిర్విణ్ణుడై నిలబడిపోయాడు.

ఆరోజంతా అదే అసహనం. రాలేదు ఇంద్రాణి.

మరి ఆమె గురించి తనెందుకు ఎక్కువగా ఆలోచిస్తున్నాడు.. 'తప్పు! ఇక ఆలోచించను' అనుకున్నాడు.

కానీ, మరునాడు వచ్చింది ఇంద్రాణి.

''జాయపులవారు క్షమించాలి!''..

ఆమె కంఠం వినగానే నిన్నటి రోజంతా సతమతం చేసిన అసహనం ఎవరో తుడిచేసినట్లు మాయమై పోయింది. ఆమె రావడమే రాజనగరి పల్లకిలో ముందూ వెనక అశ్వాలపై రక్షకభటులు వెంట రాగా.. పరివార సమేతంగా వచ్చింది. ఆమెను చూసి గురుకులమంతా ఉత్తేజితమవ్వలేదు కానీ, జాయపుడు మాత్రం హడావుడి చేసేశాడు.

''ప్రభువులవారి సోదరుని కుమార్తె.. ఇంద్రాణి దేవి. గొప్ప గాయని..'' అంటూ అందరికీ పరిచయం చేశాడు.

సాధారణంగా రాజనగరి నివాసులు గురుకులాలకు రారు. గురువులనే తమ నివాసాలకు పిలిపించుకుంటారు. గురుకుల విద్యార్థుల్లో ఎక్కువగా ధనవంతులు, కొండొకచో సాధారణ కుటుంబాలవారూ ఉంటారు. సహజంగానే రాజనగరి నివాసులంటే కులీనుల్లో ఉత్తమ స్థాయి అని భావిస్తూ గౌరవిస్తారు. కానీ, గురుకుల నియమాలు అందరినీ సమానంగానే చూస్తాయి.

ఆమెను అందరూ సాధారణంగానే గౌరవించారు కానీ జాయపుడే కాస్త ఎక్కువ హడావుడి చేశాడు.

సంగీతశాస్త్ర గురువు సుగ్రీవకు, సాహితీ గేయరచన గురువు మాజీకునికి ఇంద్రాణిని పరిచయం చేశాడు.

''నువ్వు రచించిన గేయం ఏదైనా పాడు.. దాని మంచి చెడ్డలు విచారించి రాగయుక్తం చెయ్యడం ఎలాగో ఆలోచిద్దాం..'' అన్నాడు అశోకుడు.

ఇంద్రాణి గొంతు సవరించుకుని ఓ పాట నాలుగు పంక్తులు పాడింది.

''సింగార మిదే.. నామదిలో మెదలాడిన..

సింగార మిదేనోయి.. నా తనువునెల్లా చుట్టేసిన..

శృంగారపట్టు చీరే.. భవత్ హృదయోద్భవపుల్ల సమరస ముప్పార..

సింగార మిదే.. నామదిలో ఎగసిన శృంగారమిదే!''.

''చాలు చాలు.. బావుంది. పాటో గేయమో.. అందులో శ్రవణపేయమైన శబ్దలాలిత్యం ఉండాలి. మూడవ వరుసలో పెద్ద క్లిష్టసమాసం వేశావు. అది అక్కడ ఒప్పదు. ఏదైనా అలతి అలతి పదాలతో ఉన్న పాటలో పెద్ద సమాసం ఇమడదు. నీ పేరేమిటి? జాయపా.. ఈ అమ్మాయి పేరేమిటి చెప్పావ్..?''.

''ఇంద్రాణి.. ఇంద్రాణి!''.

''ఆ.. ఇంద్రాణి! పెద్దసమాసం వల్ల శబ్దసౌందర్యం ఇనుమడిస్తుంది.. నిజమే! కానీ అలతి అలతి.. పదాలే పాటను శ్రోతకు చేరువ చేస్తాయి''.

''అలాగే గురువుగారు.. తప్పక మీసలహా ప్రకారమే గేయాన్ని రాయడానికి యత్నిస్తాను..'' అన్నది ఇంద్రాణి.

అనంతరం విద్యార్థులు.. జాయపుడు, ఇతర పరిశోధకులతో మాటామంతీ నెరపింది. తర్వాత ఓ గదిలో జాయపుడు, ఇంద్రాణి ఏకాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకొన్నారు. దాదాపు ఓ రెండు గంటలు. దూర దూరంగా నిలబడి కన్నులతో చెప్పుకొన్న ఊసులెన్నో.. ఇక్కడ మాటల పాటలై పరిమళించాయి.

జాయపుడు గుర్తించిందేమిటంటే.. ఏకాంతంలో ఆమె కబుర్లపోగు! అతను మాట్లాడటానికి అవకాశమే లేదు. తన గురించి.. తన తల్లిదండ్రుల గురించి.. రాజ వంశాల గురించి.. తన అందచందాల గురించి.. తన గానం.. గేయ ప్రావీణ్యం.. తనతో మిత్రురాళ్లు ఎలా ప్రవర్తిస్తారో.. ఇలాంటివే ఆ కబుర్లన్నీ!

**ఏదో ఆలోచిస్తూ పోతున్న జాయపుణ్ని.. ఓ బిచ్చగాడు పాడుతున్న పాట ఆపేసింది. అతని కుడిభుజంపై ఏదో వాద్యం, పై భాగాన ఉన్న ఎండు గుమ్మడి బుర్ర.. ఎడమ చేతివేళ్లతో చిన్న ఇత్తడి చిడతలు పట్టి, కుడిచేత్తో తీగెలను సవరిస్తూ.. ఏదో తత్వగీతం ఆలపిస్తున్నాడు.**

లేచి వస్తున్నప్పుడు అన్నది జాయపునితో..

''ఇక్కడ విద్యార్థులందరూ బానిస కుటుంబాల వాళ్లలా ఉన్నారే! ఓ రాజవంశపు యువతిని 'నువ్వు.. గివ్వు' అని మాట్లాడటం.. ఛ ఛ! మాకేమీ నచ్చలేదు జాయపసేనానీ!''.

విస్తుపోయాడు జాయపుడు.

కొన్ని లిప్తల్లో తమాయించుకున్నాడు. ఆ కొన్ని లిప్తల్లోనే.. అతనికి అనేకానేక అంశాలు అవగతమయ్యాయి.

ఆమె రాజనగరిలో జన్మించి ఎదిగిన కులీనురాలు. కవయిత్రి, సంగీతజ్ఞురాలు అయినా.. ఆమె ఆలోచనా ధోరణి వేరు. ఆమె తదనుగుణంగానే ప్రవర్తించింది. ఈ కబుర్లలో అతనికి ఎన్నో నేర్పించింది.

ముఖ్యంగా తానింతవరకూ ప్రవర్తిస్తున్న సరళికి.. తాను ప్రవర్తించాల్సిన సరళికి తేడా ఆమె చెప్పకనే చెప్పింది. తానిప్పుడు పరిపూర్ణ రాజయువకుడు. కేవలం జాయప కాదు.. జాయపసేనాని. తానిప్పుడు రాజనగరి నివాసి. కాబట్టి అందరూ తనను ఏకవచనంతో పిలవకూడదు. బహువచనంతోనే మాట్లాడాలి. రాజవంశ మిత్రులు, మిత్రురాళ్లు కూడా అలాగే ప్రవర్తిస్తారు.. తానూ అలాగే ప్రవర్తించాలి.. జీవించాలి.

రేపు వివాహమైతే తనభార్య కూడా ఇదే గౌరవ హోదాలు కోరుకుంటుంది కాబోలు..

ఇద్దరూ బయటికి వచ్చారు. రాజోచిత రక్షకభటుల మధ్య బయల్దేరింది. పల్లకి ఎక్కబోతుండగా అడిగాడు జాయపుడు..

''అడగడం మర్చిపోయాను.. నిన్న తమరు రాలేదు. కారణం అడగలేదు. తమరు చెప్పలేదు!''.

ఆమె నవ్వి..

''నిన్న మా పల్లకి బోయీలు రాలేదు. అందుచేత మేం రాలేకపోయాం. క్షమించాలి సేనానీ!''.

గోముగా జాయపుని హృదయం కరిగేలా ప్రేమమయ దృక్కులతో అన్నది ఇంద్రాణి.

ఈసారి జాయపుని హృదయం పెద్దగా స్పందించలేదు. అర్థమైనట్లు తల పంకించాడు.

ముందు పల్లకిలో ఇంద్రాణి.. వెనుక అశ్వంపై జాయపుడు. ఏదో ఆలోచిస్తూ పోతున్న జాయపుణ్ని.. ఓ బిచ్చగాడు పాడుతున్న పాట ఆపేసింది. అతని కుడిభుజంపై ఏదో వాద్యం, దానికి పైభాగాన ఉన్న ఎండు గుమ్మడి బుర్ర.. ఎడమ చేతివేళ్లతో చిన్న ఇత్తడిచిడతలు పట్టి, కుడి చేత్తో వాద్యానికున్న తీగెలను సవరిస్తూ.. ఏదో తత్వగీతం ఆలపిస్తున్నాడు.

అశ్వం దిగాడు జాయపుడు. నమస్కరించాడు. ఆ బిచ్చగాడు స్థాణువైపోయాడు. కంగారుపడిపోయాడు. చూస్తున్న జనంకూడా ఆశ్చర్యపోయారు. 'ఎవరో రాజవంశీయుడు బిచ్చగాడికి నమస్కరించడం.. అమ్మో.. దారుణం! కలికాలం కాకపోతే ఏమిటి!?'.

ఆ జనాన్ని పట్టించుకోకుండా అతణ్ని భుజంపట్టి అక్కడున్న ఇంటి అరుగుపై కూర్చోబెట్టి, పక్కనే కూర్చున్నాడు జాయపుడు.

''ఊ.. అద్భుతం నీ గీతం! సరే.. అదిలా ఇవ్వు. ఏమిటీ వాద్యం? భలే మోగుతున్నదే!? శ్రుతి కూడా అదిరిపోతున్నది కదా!'' అంటూ ఆ వాయిద్యాన్ని తీసుకుని.. పసిపాపను ఎత్తుకున్నట్లు ఒడిలోపెట్టుకుని పరీక్షించసాగాడు.

జీవితంలో తొలిసారి తన వాయిద్యాన్ని ఓ కులీనుడు గుర్తించి అభినందించడం.. ఆ బిచ్చగాని ముఖంలో ఓ మైమరపు. ■

(సశేషం)